ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.6 । కనిష్ఠం 20.2




నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

కామారెడ్డి టౌన్, జనవరి 19: జిల్లాలో 6వ తరగతి ప్రవేశం కోసం జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షను శనివారం నిర్వహించనున్నట్లు డీఈవో రాజు తెలిపారు. 14 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ చేయనున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లు, బాల్ పాయింట్ పెన్, హాల్ టికెట్‌లో సూచించిన నిబంధనల ప్రకారంగా తమ పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని తెలిపారు.







డుమ్మా మాస్టర్లు

- జిల్లాలో ప్రభుత్వ బడులకు హాజరు కాని 28 మంది ఉపాధ్యాయులు
- విధులు పక్కన పెట్టి వ్యాపారాల్లో బిజీ అవుతున్న పలువురు ఉపాధ్యాయులు
- రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్, కాంట్రాక్టర్ల అవతారం ఎత్తుతున్న టీచర్లు
- మరికొందరు ఉపాధ్యాయులు సంఘాల పేరిట పాఠశాలలకు డుమ్మా
- కాంప్లెక్స్ పాఠశాలల పరిధిలో బిల్లుల పేరిట విధులకు ఎగనామం
- మరికొందరు ఉపాధ్యాయులు డిప్యూటేషన్ల పేరిట పాఠశాలల ముఖం చూడని వైనం
- పైగా వారికే విద్యాశాఖలో అందలం వేస్తున్నారని ఆరోపణలు
- నష్టపోతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

కామారెడ్డి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలంలోని నందివాడ గ్రామంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఓ స్కూల్ అసిస్టెంట్ గత కొన్ని రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. లింగంపేట మండలం పోల్కంపేటలో మరో పాఠశాలలోని ఓ స్కూల్ అసిస్టెంట్ విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా హైదరాబాద్‌లో ఓ కోచింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. సదాశివనగర్ మండలంలోని కాంప్లెక్స్ స్కూల్‌లో విధులు నిర్వహించే మరో ఉపాధ్యాయురాలు విధులకు డుమ్మా కొడుతోంది. ఇదే మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించే ఓ ఉపాధ్యాయుడు ప్రధాన సంఘం పేరిట కొన్నినెలలుగా విధులకు ఎగనామం పెడుతున్నాడు. అసలు పాఠశాల ముఖమే చూడడం లేదని పై అధికారులు ప్రశ్నిస్తే వారినే బ్లాక్ మెయిల్ చేస్తుంటాడనే విమర్శలు ఉన్నాయి. మాచారెడ్డి మండలం ఓ ప్రైమరీ పాఠశాలలో పనిచేసే మరో ఉపాధ్యాయుడు సంఘం పేరిట పలు కార్యక్రమాల్లో బిజీగా ఉంటూ పాఠశాల ముఖమే చూడడం లేదు. కామారెడ్డి పట్టణ కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా రియల్ రంగంలో రాణిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. సదరు వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా విద్యాశాఖలో పెత్తనం చెలాయిస్తుంటాడని విమర్శలు ఉన్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా 28 మందిపైగా ఉపాధ్యాయులు విధులకు హాజరు కాకుండానే లక్షల్లో జీతాలు తీసుకుంటున్నారనే వాదన సొంత శాఖలోనే పలువురు ఉపాధ్యాయుల నుంచి వినిపిస్తోంది. పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు పిల్లలకు చదువులు చెపాల్సింది పోయి రియల్ ఎస్టేట్, అపార్ట్‌మెంట్ల నిర్మాణాల్లో, షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో, కాంట్రాక్టర్‌లుగా బినామి అవతారాలు ఎత్తుతూ, ప్రైవేట్ విద్యాసంస్థలు లాంటి వ్యాపారాల్లో బిజీగా ఉంటున్నారు. అయితే పదో తరగతి పరీక్షలతో పాటు ఫైనల్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులు విధులకు ఎగనామం పెడుతుండడంతో విద్యార్థులు నష్టపోతున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. విద్యాశాఖలోని ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం మండల స్థాయి విద్యాధికారులు డుమ్మా మాస్టర్లకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

బినామీల పేరిట రియల్ ఎస్టేట్, పలు దందాలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో మొత్తం 1,011 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 4 వేల మందికి పైగా ప్రభుత్వ ఉపాధ్యా యులు పని చేస్తున్నారు. ఇందులో కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులను అండగా పెట్టుకుని కోట్ల రూపాయాల్లో సైడ్ బిజినెస్ చేస్తున్నారని సొంత శాఖ నుంచే విమర్శలు వస్తున్నాయి. పలువురు రియాల్టర్లు డీలర్లతో కలిసి వీరు బినామీల దందాలు సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, మాచారెడ్డి, భిక్కనూర్, బీర్కూర్, నాగిరెడ్డిపేట, లింగంపేట, పెద్దకొడప్‌గల్, మద్నూర్, జుక్కల్ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ విధులకు హాజరుకాకుండా డిప్యూటేషన్ పేరిట బదిలీ చేయించుకుంటూ ప్రైవేట్ వ్యాపారాల్లో బిజీ అవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో, అపార్ట్‌మెంట్ల నిర్మాణాల్లో, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాల్లో పెట్టుబడులు పెడుతూ వ్యాపారాలు సాగిస్తున్నారు. పొరుగు జిల్లాల్లోనూ పలువురు వ్యాపారులు ఉపాధ్యాయులు భాగస్వామ్యం పంచుకుంటూ అధికారిక, రాజకీయ పరమైన అడ్డంకులన్నింటిని తొలగించే విధంగా వీరు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఉపాధ్యాయుల బినామీ బిజినెస్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లినా పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సంఘాల ముసుగులో విధులకు ఎగనామం

ఇక పలువురు ఉపాధ్యాయులు పలు సంఘాల ముసుగులో విధులకు ఎగనామం పెడుతున్నట్లు తెలుస్తోంది. విద్యాశాఖలో ఉన్నంత సంఘాలు ఏ శాఖల్లోనూ ఉండవు. ఈ శాఖలోని ఉపాధ్యాయ సంఘాలు పోటాపోటీగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాడడం ఓ ఎత్తయితే ఇదే ముసుగులో కొందరు ఉపాధ్యాయులు సంఘాల బాధ్యులమంటూ పాఠశాలల ముఖం చూడడం లేదు. ఉద్యమాల సమయంలో మినహాయిస్తే వేరే సమయంలోనూ విధులకు హాజరుకాకుండా పిల్లలకు చదువులు చెప్పకుండా పలు సంఘాల నాయకులు తమ సొంత వ్యాపారాల్లో బిజీ అవుతున్నారు. జిల్లాలోని కాంప్లెక్స్ స్కూళ్లలో బిల్లుల చెల్లింపుల పేరిట కారణాలు చూపుతూ రోజుల తరబడి విధులకు ఎగనామం పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా ఎస్‌జీటీ ఉపా ధ్యాయులకు డిప్యూటేషన్ల విషయంలో డీఈవో అనుమతి లేకుండానే మండల స్థాయి విద్యాధికారులు వేస్తున్నారనే విమర్శలు వస్తు న్నాయి.

వ్యాపారాలు చేస్తున్నా.. చర్యలు శూన్యమే

జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు తమ మేధాశక్తిని అంత వినియోగించి విద్యార్థులకు బోధన చేసి వారిని ఉన్నత శిఖరాలకు చేర్పించాల్సి ఉండగా తాను ఉపాధ్యాయ వృత్తి చేస్తున్నాననే అంశాన్నే మరిచిపోయి, పాఠశాలలకు హాజరు కాకుండా తమ సొంత ఎదుగుదలకు ప్రాధాన్యత ఇస్తూ బహిరంగంగా ఉన్నతాధికారుల, రాజకీయ కార్యక్రమాల్లోహల్‌చల్ చేస్తున్న విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పలువురు ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లిన దాఖలాలు లేవు. నిత్యం ఏదో ఒక ప్రైవేట్ కార్యక్రమంలో లేదంటే రాజకీయ నాయకుల కార్యక్రమాల్లో కనిపిస్తూ అసలు తన వృత్తికి చుట్టం చూపుగా హాజరవుతూ మిగిలిన కార్యక్రమాలను వృత్తిగా మలుచుకుంటున్నారనే వాదన పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పాఠశాలలకు దుమ్మాకొట్టి ఉన్నతాధికారుల, ప్రజాప్రతినిధుల కార్యక్రమాల్లో పాల్గొన్న చర్యలు శూన్యమనే వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ బడుల్లో మెరుగుపడని విద్యా ప్రమాణాలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పలువురు ఉపాధ్యాయులు పేద విద్యార్థులకు చదువు చెప్పాల్సింది పోయి తమతమ వ్యాపారాల్లో బిజీ అవుతూ పాఠశాలల ముఖం చూడడం లేదని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు జిల్లా పరిషత్, దిశ సమావేశాల్లో ప్రస్తావిస్తున్నారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలకు వెళ్లే సమయంలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు కనిపించడం లేదని ప్రజాప్రతినిధులు చెప్పుకురావడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులు హాజరుకాకపోవడం, విద్యార్థులకు విద్యా బోధనలు చెప్పకపోవడంతో విద్యాప్రమాణాలు మెరుగుపడడం లేదని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలు కనీసం తమ పేర్లను కూడా రాయలేకపోతున్నారని సమావేశాల దృష్టికి తీసుకువస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరుకాకపోవడం, తమ సొంత విద్యా సంస్థల్లోనే పని చేస్తుండడం, రియల్ వ్యాపారంలో భవన నిర్మాణాల్లో పలు కాంట్రాక్ట్‌లలో బినామి అవతారాలు ఎత్తుతూ ప్రభుత్వ జీతాలు తీసుకుంటున్నారంటూ ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. దీనిపై కలెక్టర్ దృష్టి సారించాలని ప్రభుత్వ పాఠశాలలకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులే కాకుండా పలువురు విద్యార్థి సంఘాల నాయకులు సైతం డిమాండ్ చేస్తున్నారు.

బెల్ట్ దందా ఆగేనా?

- జిల్లాలో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు
- కొన్నిచోట్ల బెల్ట్ దుకాణాలే వీడీసీలకు ప్రధాన ఆదాయ మార్గం
- మితిమిరిపోతున్న మందుబాబుల ఆగడాలు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ



బెల్ట్ దుకాణం వద్ద మద్యం తాగుతున్న గ్రామస్థులు



బెల్ట్ దుకాణంలోని మద్యం సీసాలు

రాజంపేట, జనవరి 19: జిల్లాలోని మద్యం అక్రమంగా విక్రయాలు జోరుగా సాగుతున్న అడిగేవారే కరవవుతున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు జోరుగా నిర్వహిస్తుండడంతో సామాన్య జనం బేజారవుతున్నారు. విచ్చలవిడిగా సాగుతున్న మద్యం విక్రయాలతో పల్లెల్లో చిచ్చు రేపుతోంది. తరచూ తగాదాలతో ప్రశాంతమైన పల్లె వాతావరణం పట్టు తప్పుతోంది. పగలంతా కష్టపడి రాత్రి సేద తీర్చుకునేందుకు గతంలో మద్యం తాగే వారు. ప్రస్తుతం యువకుల నుంచి వృద్ధుల వరకు మద్యానికి బానిసలుగా మారడంతో ఉదయమే చాయికి బదులు ఇంటి చుట్టు పక్కల్లోనే బెల్ట్‌షాపులలో దొరికే క్వార్టర్ తాగి తమ శరీరాలను గుల్ల చేసుకుంటున్నారు. బెల్ట్‌షాపులను ఎత్తివేయాలని మహిళలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారు లేకుండా పోతున్నారు. గత ప్రభుత్వం బెల్ట్ దుకాణాలపై నియంత్రణ చేపట్టలేదని ఎన్నో విమర్శలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వమైన గ్రామాల్లో మద్యం దుకాణాలు తొలగించేలా చేస్తుందా లేదా వేచి చూడాలి.

గ్రామాల్లో కల్తీ మద్యం జోరు

పల్లెలో అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న బెల్ట్ షాపుల నిర్వాహకులు అధిక ధరలతో పాటు కల్తీ మద్యాన్ని విక్రయిస్తూ లాభాలను గడిస్తున్నారు. కొన్ని వైన్‌షాపుల ద్వారా కల్తీ మద్యాన్ని తీసుకువచ్చి బెల్ట్ షాపుల నిర్వాహకులకు అందిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. మండల పరిధిలో ఈ తరహ దందా జోరుగా సాగుతోంది. జనావాసాల మధ్య మద్యం దుకాణాలను ఏర్పాటు చేయడంతో మందుబాబుల ఆగడాలు రోజురోజుకూ మితిమిరిపోతున్నాయి. బెల్ట్‌షాపులలో తాగి గ్రామాల్లోని దేవాలయాల దగ్గరలో బహిరంగంగానే మూత్ర విసర్జన చేయడంతో దేవాలయాల వైపు వెళ్లేందుకు మహిళలు జంకుతున్నారు. కొన్నిచోట్ల కిరాణ దుకాణాల్లో, పాన్‌షాపులలో జోరుగా విక్రయాలు చేస్తున్నారు. మండలంలో నాటు సారా, ఇప్పపువ్వుపై దృష్టి సారిస్తున్న అధికారులు బెల్ట్ దుకాణాల నివారణపై సైతం ప్రత్యేక దృష్టి సారించి నివారించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.

బెల్ట్ దుకాణాలే వీడీసీలకు ప్రధాన ఆదాయ మార్గం

బెల్ట్‌షాపుల నిర్వహణను ఉపాధి మార్గంగా మార్చుకుంటున్న కొంత మంది నిరుద్యోగులు రూ.లక్షల్లో టెండ ర్లు వేసి మరీ దక్కించుకుంటున్నారు. బెల్ట్‌షాపులు గ్రామ వీడీసీలకు ప్రధాన ఆదాయ మార్గంగా మారుతున్నాయి. అభివృద్ధి పేరిట గ్రామ అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా టెండర్ల ను నిర్వహిస్తూ లక్షల రూపాయలను దండుకుంటున్నాయి. వీడీసీల కట్టుబాట్లతో అడిగే వారే లేకుండా పోయారు. చిన్న గ్రామాల్లో 2 లక్షల నుంచి 4 లక్షల వరకు కొన్ని గ్రామాల్లో బెల్ట్ దుకాణానికి రూ.6 నుంచి 10లక్షల వరకు టెండర్లు నిర్వ హిస్తున్నారనేది జగమెరిగిన సత్యం. ఎవరైన ప్రశ్నిస్తే చాలు వారిని నానా ఇబ్బందులు పెడుతూ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని వారిని మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండి ఇంట్లో వారితో సామరస్యంగా మెలుగుతూ వారికి మనోవేదనను గురిచేయకుండా ఉంటే అది నిజమైన అభివృద్ధి అనేది వీడీసీలు గ్రహించినప్పుడే అభివృద్ధి జరుగుతుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గణతంత్ర వేడుకలను విజయవంతం చేయాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, జనవరి 19: అధికారులు సమన్వయంతో పని చేస్తూ గణతంత్ర వేడుకలను జయప్రదం చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలపై ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 10 గంటలకు కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం ప్రసంగిస్తారని అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అదనపు ఎస్పీ నారాయణరెడ్డికి సూచించారు. ప్రజాప్రతినిధులకు, అతిథులకు ఆహ్వాన పత్రికలు పంపాలని, మిగతా ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. వేదిక పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి మంచి నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, అదనపు ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్‌డీఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రజలకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశహాల్‌లో రహదారి భద్రత, జీవనరక్ష పోస్టర్లను అదనపు కలెక్టర్ చంద్రమోహన్, అదనపు ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్‌టీవో వాణి, ఆర్‌డీవో శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణం ఎంతో విలువైనదని, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగితే అమూల్యమైన జీవితాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు.

రక్తదానం వల్ల మరో ప్రాణాన్ని నిలబెట్టిన వారమవుతాం

రక్తదానం చేయడం వల్ల మరో ప్రాణాన్ని నిలబెట్టిన వారమవుతామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించడంతో పాటు రక్తదానం చేసి ఉద్యోగుల్లో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయుటకు కేవలం పది నిమిషాలు సరిపోతుందని, రక్తదానం ద్వారా మరో మూడు ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల బలహీనులు కారని, గుండె జబ్బులు, క్యాన్సర్, కొలెస్ట్రాల్ వంటి జబ్బులు కూడా దరి చేరవని అన్నారు. ఆపద సమయంలో రక్తం లభించక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ రక్తం ఇవ్వడంతో పాటు ఇప్పించేందుకు ప్రోత్సహించాలని అన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

- ఈ నెల15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు
- వాహనదారులు, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు

భిక్కనూరు, జనవరి 18: జిల్లాలో ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాల కారణంగా రోడ్లపై రక్తం చిమ్ముతునే ఉన్నాయి. కామారెడ్డి హైదరాబాద్ మహానగరానికి దగ్గరగా ఉండటంతో పాటుగా ఐదు జిల్లాల కూడలిగా ఉంది. కామారెడ్డి నుంచి హైదరాబాద్‌తో పాటుగా కామారెడ్డి నుంచి మెదక్, సంగారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేట, నిజామాబాద్‌తో పాటుగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లే రహదారులు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటాయి. దీంతో నిత్యం ఈ రోడ్లపై ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఈ రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసులు, రవాణాశాఖ అధికారులు సీసీ కెమెరాలు, బారికేడ్లు, స్పీడ్ లెజర్‌గన్‌లు ఇలా ఎన్ని రకాల చర్యలు తీసుకున్నా వాహనదారుల్లో మాత్రం ఎలాంటి మార్పు కన్పించడం లేదు. దీంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రతీ సంవత్సరం రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ మాసోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ కామారెడ్డి జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా చేయడానికి ప్రత్యేక కృషి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో యువతే ఎక్కువ

ఎంతో మంచి భవిషత్తు ఉన్న యువత ఎక్కువగా ఈ రోడ్డు ప్రమాదాల్లో మరణించడం, తీవ్ర గాయాలపాలవడం ఆందోళన కల్గిస్తోంది. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండితే వాహనాలు నడిపేందుకు అనుమతి(లైసెన్స్) లభిస్తోంది. కానీ 18 సంవత్సరాలు నిండకున్నా వాహనాలను నడపుతూ మితిమీరిన వేగంతో వెళ్ల ఎక్కువగా ప్రమాదాలకు కారణమవుతున్నారు. చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలకు ఏదో గొప్పలకు పోయి చిన్నప్పటి నుంచే వాహనాలను వారి చేతికివ్వడంతో ఇదే అదునుగా వారు వాహనాలను ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 2022 సంవత్సరంలో కంటే 2023లో జరిగిన ప్రమాదాల్లో ఎక్కువగా యువకులే మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తున్న అంశం. యువకులను కట్టడి చేయడం అధికారులకు పెద్ద టాస్కే. కాగా ప్రతీ సంవత్సరం రవాణశాఖ, పోలీసు అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న వాహనదారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. ఎంవీఐ యాక్ట్ ప్రకారం పోలీసులు విధిస్తున్న జరిమానాలే ఇందుకు నిదర్శనం.

జిల్లాలో 54 కిలో మీటర్ల జాతీయ రహదారి

బస్వాపూర్ నుంచి సదాశివనగర్ గిద్ద గ్రామం వరకు 54 కిలో మీటర్ల 44వ జాతీయ రహదారి ఉంది. ఈ రోడ్డుకు ఆనుకుని చాలా గ్రామాలు ఉన్నాయి. చాలా గ్రామాల వద్ద 44వ జాతీయ రహదారిపై సరైనా వసతులు, బ్రిడ్జిలు లేకపోవడంతో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, రవాణాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమాలు ఇలా...

రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ, పోలీసు శాఖ అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రతిరోజూ జిల్లా వ్యాప్తంగా మార్కెట్ స్థలాలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ట్రాఫిక్ నిబంధనలు, ఎంవీఐ చట్టం, హెల్మెట్, సీట్‌బెల్టు ఉపయోగం, తదితర అంశాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నారు.

నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నాం : తిరుపయ్య, భిక్కనూరు సీఐ

రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానాలు విధించడం జరుగుతుంది. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపట్ల, అతివేగంగా వాహనాలను నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నాం. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం. రోడ్డు భద్ర మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించి తమ సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.









మార్కెట్ యార్డుకు అమ్మకానికి కొత్త పసుపు

ఖిల్లా, జనవరి19: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం రైతులు కొత్త పసుపును అమ్మకానికి తీసుకువచ్చారు. మొదటిరోజు ఇద్దరు రైతులు సుమారు 30 క్వింటాల పసుపును తీసుకురాగా క్వింటాకు ధర రూ.10,200 పలికింది. ప్రతీయేడు జనవరి నుంచి జిల్లాతోపాటు జగిత్యాల, నిర్మల్, మహారాష్ట్రకు చెందిన రైతులు పండించిన పసుపును అమ్మకానికి తీసుకువస్తారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డుకు వచ్చిన పసుపును సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి వెంకటేశం, సెకండ్ గ్రేడ్ కార్యదర్శి విజయ్‌కిశోర్ సిబ్బందితో పసుపును పరిశీలించారు. రైతులు నాణ్యమైన పసుపు తెచ్చి మంచి ధర పొందాలని సూచించారు.

నగరంలో దొంగతనం

● 10 తులాల బంగారం, 2లక్షల నగదు అపహరణ

ఖిల్లా, జనవరి 19: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల గాజుల్‌పేట్‌లో దొంగతనం జరిగిన ఘటన శుక్రవారం సాయంత్రం వెలుగు చూసింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల్‌పేట్‌కు చెందిన బాధితుడు వాసుగౌడ్ ఈనెల 15న శబరిమలైకు బయల్దేరాడు. అతని భార్య బంధువుల ఇంటికి నిద్ర కోసం గురువారం వెళ్లింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి వెనకవైపు నుంచి లోపలికి చొరబడి ఇంట్లో గల బీరువాను ధ్వంసం చేసి అందులోగల సుమారు 10 తులాల బంగారం, 2లక్షల నగదును అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి ముందు గల గేటుకు వేసిన తాళం వేసినట్లుగానే ఉందని ఎవరికి అనుమానం రాకుండా దుండగులు వెనుక ఉన్న తలుపుతాళం పగలగొట్టి లోనికి చొరబడ్డారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.


వృద్ధురాలిని నమ్మించి బంగారం చోరీ

రెంజల్, జనవరి 19: మండలంలోని నీలా గ్రామానికి చెందిన అంబెం పోసాని అనే వృద్ధురాలికి గుర్తుతెలియని వ్యక్తి మాయమాటలు చెప్పి ఆమె చెవులకు ఉన్న బంగారు నగలు(నాగులు) తీసుకుని పరార్ అయ్యాడని ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నీలా గ్రామానికి చెందిన అంబెం పోసాని ఉదయం ఇంటిముందు కూర్చుని ఉండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మాయమాటలు చెప్పి పింఛన్ ఇప్పిస్తామని నమ్మబలికి ఆమె చెవులకు ఉన్న బంగారు నగలను దాచుకోవాలని చెప్పి ఆ నగలను లాక్కొని వెళ్లిపోయ్యాడన్నారు. పోసాని గమనించి అరుపులు కేకలు వేసి స్థానికులకు విషయం చెప్పేలోగా వ్యక్తి పరారీ అయ్యాడని అన్నారు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు చేరడంతో విషయం తెలుసుకున్న బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్ సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న సీసీ కెమెరాల ద్వారా ఘటనకు దారితీసిన వివరాలను ఎస్సై సేకరిస్తున్నారు. బాధితురాలు అంబెం పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

5లక్షల విలువ గల ఆల్ఫ్రాజోలం పట్టివేత

● ఇద్దరి అరెస్టు

సుభాష్‌నగర్, జనవరి 19: కల్తీకల్లులో కలిపే మత్తు పదార్థాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ తెలిపారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కామారెడ్డి పట్టణ శివారులో నిర్వహించిన తనిఖీల్లో కల్తీకల్లులో కలిపే ఆల్ఫ్రాజోలం రవాణా చేస్తూ అమ్మకానికి పాల్పడుతుండగా కబిరె సాగర్‌గౌడ్, మెడుమల సాగర్‌గౌడ్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 900 గ్రాముల ఆల్ఫ్రాజోలంను పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు బైకులు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వీటి విలువ సుమారు 5లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు వెంకటేశ్, స్వప్న, ఎస్సై రామ్‌కుమార్, సిబ్బంది శ్రీను, ప్రసాద్, ఉత్తమ్, భోజన్న, విష్ణు, అవినాశ్, రామ్‌బచ్చన్, తదితరులు పాల్గొన్నారు.











సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్

ఆర్‌అండ్‌బీ, విద్యాశాఖ

అధికారుల పనితీరుపై ఆగ్రహం

- డబుల్ బెడ్‌రూమ్ బిల్లులు త్వరితగతిన చెల్లించాలి
- కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు

కోటగిరి, జనవరి19: ఆర్‌అండ్‌బీ, విద్యాశాఖ అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కోటగిరి ఉమ్మడి మండలంలో పలు ప్రధాన రహదారులు అధ్వానంగా మారి కల్వర్టుల వద్ద రక్షణ గోడలు లేక ప్రాణాలుపోతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని మండలసభలో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ జీయన్ పనితీరుపై వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. పొతంగల్-మద్నూర్ రహదారి అధ్వానంగా మారిందని, రహదారి ప్యాచ్ వర్క్‌లను చేపట్టకపోవడంపై తీవ్రంగా మండిపడ్డారు. డోంగ్లీ మండలంలోని సిర్పూర్ బర్డర్ వరకు రహదారి నిర్మాణం పూర్తిన పొతంగల్ బర్డర్‌కు అనుసంధానం చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. పొతంగల్ మండలంలోని సుంకిని పాఠశాలను జిల్లా పరిషత్ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసిన అధికారులు ఉపాధ్యాయులను నియమించకపోవడంపై ఎంపీటీసీ సాయిలు, సర్పంచ్ మాధవరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్‌చేశారు. మండలంలో ఇసుక కొరతతో పలు ప్రగతి పనులు నిలిచిపోతున్నాయని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు పనులకు ఇసుకను కేటాయించాలని సభ్యులు కోరారు. ఈ విషయమై పొతంగల్ తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధిత గ్రామ పంచాయతీ ద్వారా అనుమతి తీసుకొస్తే ఇసుకను తరలించేందుకు అనుమతిస్తామన్నారు. ఎత్తొండ గ్రామంలో అభివృద్ధి పనుల కోసం ఇసుక, మొరం కోసం డీడీలు చెల్లించినా ఇబ్బందులు తప్పడం లేదని ఎంపీటీసీ ఫారూఖ్ ఫిర్యాదుచేశారు. నిధులు లేక గ్రామ పంచాయతీలు ఇబ్బందులు పడుతుంటే మిషన్‌భగీరథ నీటిసరఫరా తమపై అదనపు భారం పడుతుందని, ఈ బాధ్యతను సంబంధిత శాఖ అధికారులే నిర్వహించాలని సర్పంచ్‌లు కోరారు. డబుల్ బెడ్ రూమ్ బిల్లుల పంపిణీ విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కోటగిరి ఎంపీటీసీ కొట్టం మనోహర్ ఎంపీడీవో మనోహర్‌రెడ్డిని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూమ్ బిల్లుల పంపిణీ తమ పరిధిలో లేదని, గృహ నిర్మాణ శాఖ అధికారులను సంప్రదించి బిల్లుల విషయమై వివరాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, తహసీల్దార్‌లు రమేష్, ప్రభాకర్, ఆయా శాఖల అధికారులు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో

నిజాంషుగర్స్ కార్మికుల వినతి



ప్రజావాణిలో పాల్గొన్న నిజాంషుగర్స్ కార్మికులు

బోధన్‌రూరల్, జనవరి19: హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో నిజాంషుగర్స్ కార్మికులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్ మాట్లాడుతూ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ లే ఆఫ్ అయినప్పటి నుంచి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు ఇప్పించాలని కోరారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వం పునరుద్ధరిస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని మళ్లీ తెరిపిస్తే ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. ఎనిమిదేళ్లుగా కార్మికులకు వేతనాలు లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బోధన్, మెదక్, మెట్‌పల్లి కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీయూ లైబ్రరీకి పుస్తకాల అందజేత

డిచ్‌పల్లి, జనవరి 19: తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రధాన గ్రంథాలయానికి స్వర్గీయ పద్మశ్రీ సిరివెన్నెల సీతారామ శాస్త్రి సమగ్ర సాహిత్య పుస్తకాలను ఉత్తర అమెరిక తెలుగు సంఘం (టానా) పుస్తకాల ప్రచురణ గౌరవ సంపదకులు డా.తోటకూర ప్రసాద్, ఆయన తరపున డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొ.త్రివేణి, తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. యాదగిరికి ఈ పుస్తకాలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.ఆరతి, డీన్ ప్రొ.త్రివేణి, యూజీసీ డైరెక్టర్ ఆంజనేయులు, పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'

బోధన్‌రూరల్, జనవరి19: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తోందని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు అద్దంకి ఉషాన్, పబ్బ మురళీ, కృష్ణారావు, ప్రకాశం, సీతారాం, జ్ఞానేశ్వర్, సత్యనంద్, కోటేశ్వరరావు, అద్దంకి లింగయ్య. కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, పీట్ల సత్యం, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నవీపేట, జనవరి 19: నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య వయసు గల వ్యక్తి మృతి చెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. గురువారం రాత్రి 7గంటల సమయంలో బాసర రైల్వే స్టేషన్‌లో బాసర నుంచి రాజమండ్రి వెళ్లడానికి అతడు జనరల్ టికెట్ తీసుకుని రైలులో ప్రయాణించాడని తెలిపారు. శుక్రవారం ఉదయం రైలు కాజీపేట్ చేరగా సంబంధిత వ్యక్తి రైలులో మృతి చెందాడని, వెంటనే కాజీపేట రైల్వేపోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. మృతుడి వద్ద రైలు టికెట్ తప్ప ఎటువంటి ఆధారాలు లభించలేదని, అతని ఆచూకీ తెలిసినవారు కాజీపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

అభంగపట్నం, అబ్బాపూర్(ఎం)లలో గ్రామసభలు

నవీపేట, జనవరి 19: మండలంలోని అభంగపట్నం, అబ్బాపూర్(ఎం)లలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. వికసిత్‌భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ, ఏపీఎం భూమేష్ గౌడ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, తదితరులున్నారు.

పేకాట కేంద్రాలపై దాడులు

కోటగిరి, జనవరి19: మండలంలోని సుద్దులం తండా, కారేగాం గ్రామాల్లో పేకాటకేంద్రాలపై శుక్రవారం ఎస్సై సందీప్ దాడులు నిర్వహించారు. సుద్దులం తండాలో పేకాడుతున్న ఆరుగురిని పట్టుకుని రూ.6,320 సీజ్‌చేశామన్నారు. కారేగాంలో మరో ఆరుగురిని పట్టుకుని రూ.2,400 నగదును సీజ్ చేసి పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తీగల వాగుపై

బ్రిడ్జి నిర్మాణ పనుల ప్రారంభమెప్పుడో?

- వాగు వద్ద ప్రమాదకర మలుపులు, తరుచూ ప్రమాదాలు
- వంతెన నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు
- మంజూరై నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- అప్పుడు.. ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తున్న అధికారులు

ఏర్గట్ల, జనవరి 19: మండల కేంద్రమైన ఏర్గట్ల శివారులో రెండు జిల్లాల సరిహద్దు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి దారిలో తీగల వాగుపై హైలెవల్ వంతెన పనులకు నిధులు మంజూరైనా నేటికీ పనులు ప్రారంభించడం లేదు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని చుట్టుపక్క గ్రామాల ప్రజలు, నిర్మల్‌కు వెళ్లే ప్రయాణీకులు ఈ వాగు మీదుగా రోజు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వాగుపై పైపుల ద్వారా లోలెవల్ బ్రిడ్జి నిర్మించినప్పటికీ ప్రయాణీలకు కష్టాలు తప్పడం లేదు. వాగు వద్ద ప్రమాదకరమైన మలుపు ఉండటంతో దానితో ఎదురుగా వచ్చే వాహనాన్ని ప్రయాణికులు గమనించలేక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఈ వాగుపై వెళ్లాలంటే వాహనదారులు భయం భయంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఈ లోలెవల్ బ్రిడ్జి సుమారు 100 మీటర్ల పొడవు, ఎత్తు తక్కువగా ఉండటంతో వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే నీరు పై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో వాహనదారులు తిరుగు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. రైతులు పండించే పంటను ఇంటికి తీసుకెళ్ల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుష్కరాల సమయంలో డబుల్ రోడ్డుతోపాటు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో అది కలగానే మారింది. గ్రామంలోని ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని అప్పుడు మంత్రిగా ఉన్న వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆర్‌డీఎఫ్ అండ్ ఎఫ్‌డీఆర్ నుంచి రూ.3 కోట్ల 5లక్షల నిధులు మంజూరయ్యాయి. గతేడాది అక్టోబరులో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేశారు. తర్వాత పనులు ముందుకు సాగలేదు. అధికారులు స్పందించి తీగల వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, దీని వల్ల రెండు జిల్లాల సహరిహద్దు గ్రామాల ఇబ్బందులు తొలగిపోతాయని ప్రజలు కోరుతున్నారు.

రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తాం

- వినిత్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

రెండు జిల్లాల సరిహద్దు వద్ద గల తీగల వాగు హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. మరో రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తాం.



ఏర్గట్లలోని తీగల వాగు

ఆబ్కారీ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

- ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోరా.?
- పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎడపల్లి, జనవరి19: గంజాయి, ఇతర మత్తు పదార్థాల వ్యాపారంపై స్థానిక ప్రజలు ఫిర్యాదుచేసినా ఆబ్కారీశాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆ శాఖ బోధన్ సీఐ, ఎస్సైలపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఎడపల్లి మండలంలో మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే పర్యటించారు. కుర్నాపల్లి గ్రామంలోని పాఠశాలను పరిశీలించారు. రాణాకలాన్, కుర్నాపల్లి గ్రామాలలో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, వీటిని అరికట్టాలని ఎక్సైజ్ అధికారులను హెచ్చరించారు. అంతకు ముందు జానకంపేట గ్రామశివారులో గల శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాణాకలాన్ గ్రామానికి వెళ్లి గ్రామంలో నెలకొన్న సమస్యలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థుల, పాఠశాల సిబ్బంది వివరాలను హెచ్‌ఎంని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల శాతం తక్కువగా ఉందని విద్యార్థుల శాతం పెంచాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. గ్రామానికి ఆర్టీసి బస్సును ప్రారంభించారు. మంగల్‌పాడ్ గ్రామంలోని బాలాత్రిపుర సుందరీ దేవి అలయం లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాలులో ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. గ్రామంలోని ప్రజలకు వీధి లైట్లు, డ్రైనేజీ, త్రాగునీరు ఇతర ప్రజలకు అవసరమున్న సౌకర్యాలు అన్ని సక్రమంగా ఉండేట్లు చూడాలని పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌ను ఆదేశించారు. అనంతరం అంబం గ్రామంలోని గ్రామస్థులను ఆయన కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. గ్రామస్థులు ఇండ్లు లేని వారికి ఇండ్లు కావాలని ఆయనను కోరారు. బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలోని ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జైతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించి విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన గురించి అడిగి తెలుసు కున్నారు. ఆయా గ్రామాల నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రిఫిల్‌లో మత్తు పదార్థాలు నింపి అమ్ముతున్నట్లు తెలిసిందని, పేకాట, బెల్టు షాపులు తదితర వాటిపై సంబంధిత అధికారులు ఉక్కుపాదం మోపి అణచివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాహెర్‌బిన్‌హందాన్, గడుగు గంగాధర్, అంతిరెడ్డి రాజిరెడ్డి, తాళ్ల విజయ్ కుమార్ గౌడ్, రాధా కిషన్ గౌడ్, పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, శంకర్ నాయుడు, బంజ కామప్ప, అదికారులు ఉన్నారు

సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలి: ఎమ్మెల్యే

బోధన్‌రూరల్: ఆరు గ్యారంటీల హామీలను తప్పకుండా అమలు చేస్తామని, నియోజకవర్గ ప్రజలు సమస్యలను తన దృష్టికి తేవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అయేషా ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 269 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, గణపతి రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు గడుగు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామానికి చేరిన మృతదేహం

డిచ్‌పల్లి, జనవరి 19: మండలంలోని దూస్‌గాం గ్రామానికి చెందిన సురుకుంట్ల ప్రవీణ్‌కుమార్ (30) ఈనెల 2న సౌదీఅరేబియాలో విధులు నిర్వహిస్తూ నిచ్చెన పైనుంచి నేలపై పడి అక్కడిక్కడే మృతిచెందగా ఆయన మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరుకుంది. కంపెనీ యాజమాన్యంతోపాటు స్థానికులు ఇండియన్ ఎంబసీ ద్వారా సంప్రదింపులు చేయడంతో మృతదేహన్ని పంపించారు. మృతుడి భార్య సమత, ఇద్దరు కుమార్తెలు, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యులు సా ఽయంతం ప్రవీణ్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు.

ఆర్మూర్‌లో ఆరేళ్ల బాలుడిపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు

ఆర్మూర్‌టౌన్, జనవరి 19: మున్సిపల్ పరిధిలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో తొండి హరిచరణ్ అనే ఆరేళ్ల బాలుడిపై కుక్కలు దాడిచేశాయి. శుక్రవారం ఇంటి పరిసరాలలో ఆడుకుంటున్న బాలుడు హరి చరణ్‌పై కుక్కలు దాడిచేయడంతో కాళ్లకు గాయాలయ్యాయి. గమనించి తల్లిదండ్రులు బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని చికిత్స చేయించారు. కాలనీలలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, కట్టడి చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దొంగను పోలీసులకు పట్టించిన స్థానికులు

ఆర్మూర్‌టౌన్, జనవరి19: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రసన్నంజనేయ ఆలయం వద్ద ఓ దొంగను స్థానికులు పోలీసులకు పట్టించారు. గురువారం రాత్రి ప్రసన్నంజనేయ ఆలయంలోకి ప్రవేశిస్తున్న దొంగను స్థానికుడు రుద్ర మధుసూదన్ తన ఇంట్లో ఉన్న సీసీ పుటేజీలు చూసి పోలీసులకు సమాచారం అందించి దొంగను పట్టించారు. దీంతో కాలనీ వాసులు మధుసూదన్‌ను అభినందించారు.

రోడ్డును కబ్జా చేసిన వారిపై ఆర్డీవోకు ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్, జనవరి 19: మున్సిపల్ పరిధిలోని ఎన్‌టీఆర్‌కాలనీలో రోడ్డును కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కాలనీ వాసులు ఆర్డీవో వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్‌టీఆర్ కాలనీలో రోడ్డును కబ్జాచేసుకొని ఇద్దరు వ్యక్తులు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని, వారిపై చట్టరీత్యా చర్య తీసుకొని రోడ్డును కబ్జా కాకుండా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఆల్గోట్ సత్యనారాయణ, శీను, శ్రావణ్, నరేందర్, రాజశ్రీ, మానస, అను పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌రూరల్, జనవరి 19: ఆర్మూర్‌లోని మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని నాహీదఫిర్దోస్ కోరారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులు, 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో మొత్తం 80 సీట్లకు గాను 60సీట్లు ముస్లీం మైనారిటీలకు పది బీసీ, మూడు ఎస్సీ, ఐదు ఎస్టీ, రెండు ఓసీ ఉన్నాయని తెలిపారు. అదే విధంగా 6, 7, 8 తరగతులలో మిగిలిన మైనారిటీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఇంటర్‌లో 30బైపీసీ, 30ఎంపీసీ సీట్లు ఉన్నాయని బైపీసీలో ఐదు బీసీ, రెండు ఎస్సీ, రెండు ఎస్టీ, ఓసీలకు ఒక సీటు ఖాళీగా ఉందని దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

వంజరి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, జనవరి 19: తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాస్టర్ శ్రీనివాస్, రాష్ట్ర ప్రతినిధులు కాలేరు శ్రీనివాస్, గోపాల్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు భూమయ్య, నగర అధ్యక్షుడు గంగాధర్, పాఠశాల కార్యదర్శి లడ్డా నర్సయ్య, బోదుగం శ్రీను, తదితరులు ఉన్నారు.

అద్దె చెల్లించి దేవాలయాల అభివృద్ధికి తోడ్పడాలి

బోధన్‌రూరల్, జనవరి19: దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న దుకాణదారులు అద్దెలను సక్రమంగా చెల్లించి దేవాలయాల అభివృద్ధికి తోడ్పడాలని దేవాదాయ శాఖ పరిశీలకురాలు బి.కమల అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని మారుతి మందిరం, దుకాణ సముదాయంలోని షాప్‌నెం.1ను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణ నిర్వాహకులు సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో పోలీసు, రెవెన్యూ శాఖల సమక్షంలో దుకాణాన్ని సీజ్‌చేశామన్నారు. జిల్లాలోని దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న దుకాణదారులు తమ మడిగె అద్దెలను క్రమం తప్పకుండా చెల్లించి దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయ కార్యనిర్వాహణాధికారి రవీందర్ గుప్త, రాములు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరుణ్, ఆలయ అర్చకులు ప్రవీణ్ మహరాజ్ తదితరులు ఉన్నారు.



దేవాదాయ ఆధీనంలోని దుకాణాన్ని సీజ్ చేస్తున్న దృశ్యం

రాంపూర్ వీడీసీ సభ్యులపై కేసు

డిచ్‌పల్లి, జనవరి19: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఆరుగురు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన షేర్‌ఖాన్ రాంపూర్‌లో చికెన్ సెంటర్ నిర్వహణకు వీడీసీ సభ్యులు తరుచూ అడ్డంకులు సృష్టించడంతో పోలీసులను ఆశ్రయించాడు. షేర్‌ఖాన్ ఫిర్యాదుతో రాజ్‌కుమార్, సుమన్, లింగం, రాజన్న, నరేశ్, రవిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీడీసీ సభ్యులు చట్టాన్నిచేతుల్లోకి తీసుకుంటే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

పన్ను చెల్లింపులో ప్రభుత్వ సిబ్బంది ముందుండాలి

ధర్పల్లి, జనవరి 19: ఇంటి పన్నుల చెల్లింపుల్లో ప్రభుత్వ సిబ్బంది ముందుండి పన్నులను సకాలంలో చెల్లించాలని సర్పంచ్ ఆర్మూర్ పెద్దబాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఇంటి పన్నుల బకాయిలకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో 20శాతం మేర పన్నులు వసూలు అయ్యాయని, మార్చిలోపు 80శాతం పనులు వసూలే లక్ష్యంగా గ్రామస్థులు గామపంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వీడీసీచైర్మన్ అర్గుల్ రాజేశ్వర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ రైతు ఉత్పత్తిదారుల సమావేశం

ముప్కాల్, జనవరి 19: బాల్కొండలోని సమాఖ్య కార్యాలయంలో బాల్కొండ, ముప్కాల్ మండలాల శ్రీరాంసాగర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఎదుట వీవోడీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథి ఏపీడీ మధుసూదన్‌లు పాల్గొన్నారు. నాగాపూర్‌లో పిండి గిర్ని ప్రారంభించినట్లు సభ్యులు తెలిపారు.

రూ.25 కోట్లతో వంతెనల నిర్మాణం

- నియోజకవర్గంలోని పలు చోట్ల బ్రిడ్జి పనులకు శంకుస్థాపన
- వర్షాకాలంలోపు పనులు పూర్తి: ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, జనవరి19: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో రూ.25 కోట్లతో హైలెవెల్ వంతెనలను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఈ పనులను వచ్చే వర్షకాలం లోపు పూర్తి చేసేల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని నడిపల్లి శివారులో డిచ్‌పల్లి-నిజామాబాద్ రహదారిపై నాలుగు వరుసల హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. పాటితండా, లింగపూర్, గడ్కోల్, ఎల్లారెడ్డిపల్లి ప్రాంతాల్లో నిర్మించనున్న వంతెన నిర్మాణపనులు నాణ్యతతో చేపట్టాలని, అధికారులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలించాలని ఆదేశించారు. ప్రజల మౌలిక అవసరాలు తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సు, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల పెంపు అమలు చేశామని తెలిపారు. శిలాఫలకంలో తనపేరుపై గులాబీ రంగు ఉండటంపై అధికారులను ప్రశ్నించారు. తక్షణమే ఆ రంగును మార్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, పార్టీ ప్రతినిధులు షాదుల్ల, కంచెట్టి గంగాధర్, శాంసన్, పిచ్చేశ్వరరావు, వాసుబాబు, మురారి, గడీల శ్రీరాములు, పొలసాని శ్రీనివాస్, మురళి, చిన్నోళ్ల నర్సయ్య, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్దే లక్ష్యం..

ధర్పల్లి: గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వాడి-ఒన్నాజిపేట గ్రామాల మధ్యగల హైలెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. రూ.9 కోట్ల 50లక్షల తో ఈ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. హైలెవల్ బ్రిడ్జితో రాకపోకలకు సమస్యలు సమసిపోతాయని చెప్పారు. ఆరు గ్యారంటీలను వందరోజుల్లో అమలు చేస్తామన్నారు. రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాలో జమ అవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాడి, ఒన్నాజిపేట్ గ్రామాల సర్పంచులు భాగవ్వ, భగవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బేల్దారి కృష్ణ, మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇందల్వాయి: మండలంలోని ధర్పల్లి రోడ్‌లోగల వెంగల్‌పాడ్, ఎల్లారెడ్డిపల్లి వాగులపై హైలెవల్ వంతెనకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. వెంగల్‌పాడ్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు వాగుపై వంతెనకు రూ.7కోట్లు, ఎల్లారెడ్డిపల్లి వద్ద గల వంతెనను రూ.5కోట్లు మంజూరు అయ్యాయని, వీటికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయరని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఇమ్మడిగోపి, చింతల కిషన్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ కొరట్‌పల్లి ఆనంద్, రాజేందర్, మోతిలాల్, గంగాధర్ పాల్గొన్నారు.



నడిపల్లిలో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

రైతులకు రుణ మాఫీ చేసి తీరుతాం..

సిరికొండ: రైతాంగానికి రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. గడ్కోల్ గ్రామంలో కప్పల వాగుపై రూ.12 కోట్ల నిధులతో నిర్మించే హై లెవల్ వంతెన నిర్మాణాకి ఎమ్మెల్యే భూపతి రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ వాళ్లకు ఓపిక లేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పాఈర్ట మండల అధ్యక్షుడు, సర్పంచ్ దేవగౌడ్, ఎంపీటీసీ సభ్యులు గంగారాం, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, గడీల రాములు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మామిడి రాములు, సభ్యులు నిమ్మల భాస్కర్, రమేష్, నవీన్, నరేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అల్ఫ్రాజోలంను తీసుకెళ్తున్న ఇద్దరి అరెస్టు

కామారెడ్డి టౌన్, జనవరి 19: కామారెడ్డి పట్టణ శివారులో కల్తీకల్లు తయారు చేసేందుకు అల్ఫ్రాజోలం అనే నార్కోటిక్ డ్రగ్‌ను రవాణా చేస్తూ అమ్మకానికి పాల్పడుతుండగా నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కదిరె సాగర్‌గౌడ్, మేడుదుల సాగర్‌గౌడ్ అనే వ్యక్తులు అల్ఫ్రాజోలంను రవాణా చేస్తుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేష్, ఎస్ఐ రాంకుమార్‌లు దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టడడంతో పాటు 900 గ్రాముల అల్ఫ్రాజోలంను, రెండు ద్విచక్రవాహనాలు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అల్ఫ్రాజోలం విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ దాడులలో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనుప్రసాద్, భోజన్న, ఉత్తమ్, విష్ణు, అవినాష్, రామ్ బచ్చన్‌లు పాల్గొన్నారు. మత్తుపదార్థాలను అమ్మినా, రవాణా చేసినా ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గాయత్రి షుగర్స్‌లో కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్, జనవరి 19: గాయత్రి షుగర్స్‌లో చెరుకు క్రషింగ్ సాఫీగా కొనసాగుతున్నట్లు వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. 63 రోజులు క్రషింగ్ జరగగా 1,98,406 టన్నుల చెరుకు క్రషింగ్ నిర్వహించి 2,05,990 బస్తాల చక్కెర ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. రోజుకు 3,460 టన్నుల క్రషింగ్‌తో సగటున 10.72 శాతం రికవరీతో కొనసాగుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని సూచించారు.



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

లబ్ధిదారులకు బియ్యం సక్రమంగా సరఫరా చేయాలి

తాడ్వాయి, జనవరి 19: లబ్ధిదారులకు బియ్యం సక్రమంగా సరఫరా చేయాలని తహసీల్దార్ సునీత రేషన్‌డీలర్లకు సూచించారు. శుక్రవారం తాడ్వాయి మండల కేంద్రంలోని, సోమారం, బ్రాహ్మణపల్లిలోని దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లో స్టాక్‌లో తేడాలు వచ్చినట్లయితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ దుకాణాల్లో లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించినట్లయితే డీలర్లపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ వెంకటేష్, ఆర్ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

29న ఎస్ఎంసీల ఎన్నికలు జరపాలి

కామారెడ్డి టౌన్, జనవరి 19: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, సంక్షేమ, ఎయిడెడ్ పాఠశాలలో ఈ నెల 29న పాఠశాల నిర్వహణ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు జరపాలని ప్రధానోపాధ్యాయులను డీఈవో రాజు ఆదేశించారు. రాష్ట్ర అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల ఆధారంగా ఈనెల 20న అన్ని పాఠశాలల్లో నోటిఫికేషన్ విడుదల చేసి విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలన్నారు. 22, 23న లిస్టులో ఏవైన అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిష్కరించాలని, 24న తల్లిదండ్రుల తుది జాబితాను ప్రదర్శించాలని తెలిపారు. ఈనెల 29న ఉదయం 1 గంటల నుంచి 1 గంటల వరకు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులను ఎన్నుకుని వారిలో నుంచి ఒకరు అధ్యక్షుడిగా, ఒకరు ఉపాధ్యాక్షుడిగా ఎన్నుకోవాలని తెలిపారు. ఎన్నికైన జాబితాను ఈనెల 29 సాయంత్రం 5 గంటలలోగా డీఈవో కార్యాలయానికి పంపించాలని తెలిపారు.



డీజిల్ దొంగిలించిన ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

గోపాల్‌పేటలో ట్రాక్టర్ నుంచి డీజిల్ చోరీ

నాగిరెడ్డిపేట, జనవరి 19: మండల కేంద్రంలోని గోపాల్‌పేట గ్రామ పంచాయతీకి సంబంధించిన చెత్త తరలించే ట్రాక్టర్ నుంచి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 15 లీటర్ల డీజిల్‌ను దొంగిలించుకుపోయినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి భూమేశ్వర్ తెలిపారు. గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ లోంచి తరచూ డీజిల్ దొంగతనానికి గురవుతుండటంతో తమ గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను గత కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు. రోజులాగే తమ ట్రాక్టర్‌ను గురువారం రాత్రి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉంచగా శుక్రవారం ఉదయం చెత్త తరలింపు కోసం ట్రాక్టర్‌ను తీసుకురావడానికి వెళ్లిన ట్రాక్టర్ డ్రైవర్ సాయిలు ట్రాక్టర్ లోంచి డీజిల్ చోరీకి గురైనట్లు తెలుసుకుని తమకు సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో ట్రాక్టర్ వద్దకు వెళ్లి పరిశీలించగా ట్రాక్టర్ నుంచి సుమారు 15 లీటర్ల డీజిల్ చోరీకి గురైందన్నారు. గత నెల డిసెంబరు 15న పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పల్లె ప్రకృతి వనం వద్ద రాత్రి ఉంచిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్ నుంచి 40 లీటర్ల డీజిల్‌తో పాటు, ట్రాక్టర్‌ను అమర్చిన సిస్టిమ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని, దీంతో అప్పట్లో డీజిల్ చోరీ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

ప్రజా సమస్యలపైనే అధికారులు దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు

బిచ్కుంద, జనవరి 19: ప్రభుత్వ ప్రయోజనాలు పొందడానికి ప్రజలకు ఎదురయ్యే సమస్యలపైనే అధికారులు దృష్టి సారించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అశోక్ పటేల్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వ్యవసాయ, రెవెన్యూ, వైద్య, విద్యుత్‌శాఖల్లో లోటుపాట్లను నివేదిక రూపంలో అందించాలని ఆదేశించారు. ధరణిలో నమోదైన రైతుల భూముల వివరాలు కాకుండా పార్ట్ బీ లో సాగవుతున్న భూముల వివరాలు సాగు చేస్తున్న రైతుల వివరాలను తహసీల్దార్ గ్రామాల వారిగా నివేదిక సిద్ధం చేసి వాటి వివరాలు తెలిపితే ఉన్నతాధికారులతో సంప్రదించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు, బోరు మోటార్ల కోసం రైతులు చేసుకున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు విద్యుత్ శాఖాధికారులు పరిష్కరించాలని తెలిపారు. నియోజకవర్గానికి కేంద్ర బిందువైన బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్‌చార్జ్ వైద్యాధికారులు మాత్రమే పని చేయడం బాధాకరమని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజాపరిపాలన గ్రామసభలలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను క్షుణంగా పరిశీలించి అర్హులైన వారికి తప్పకుండా ప్రభుత్వ ప్రయోజనం చేకూరేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎంపీపీ అశోక్‌పటేల్, వైస్ ఎంపీపీ రాజుపటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగ్‌నాథ్‌పటేల్, సొసైటీ చైర్మన్ నాల్చర్‌బాలు, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో ఆనంద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌పై ఎన్ని ఆరోపణలు చేసినా..

రైతులకు సాగు నీటిని అందిస్తాం!'

బీర్కూర్, జనవరి 19 : బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై ఎన్ని ఆరోపణలు చేసినా బీర్కూర్ రైతులకు సాగు నీటిని అందిస్తామని కాంగ్రెస్ నాయకుడు చందు స్పష్టం చేశారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, రైతుల అభ్యర్థన మేరకు బీర్కూర్ మండలంలో పర్యటించి, కాలువలను పరిశీలించారని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల 26/4 డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మాణం కాలేదని విమర్శించారని అన్నారు. దీంతో కొంత మంది బీఆర్ఎస్ నాయకులు పని కట్టుకుని పంట కాలువలపై రాజకీయాలు చేస్తున్నారని, రైతులను తప్పుదోవ పట్టించే విధంగా ప్రయత్నిస్తు న్నారని విమర్శించారు. 2008లో అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బీర్కూర్ రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో 26/4 ఉప కాలువ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారన్నారు. కొన్ని కారణాల వల్ల పనులు నిలిచిపోయాయని, అనంతరం కాలువ గురించి తరువాత వచ్చిన పాలకులు పట్టించుకోలేదన్నారు. దీంతో పొలాలకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి కాలువలను పరిశీలించి, 26/4 ఉప కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి సాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చారన్నారు.

సేంద్రియ ఎరువులు ఉపయోగించాలి

● ఏఈవో ఆనంద్

భిక్కనూరు, జనవరి 19: రైతులు సేంద్రియ ఎరువులు ఉపయోగించి భూసారాన్ని కాపాడుకోవాలని ఏఈవో ఆనంద్ సూచించారు. శుక్రవారం మండలంలోని బస్వాపూర్ రైతువేదికలో భిక్కనూరు, బీబీపేట మండలాలకు చెందిన రైతులకు పర్యావరణ అనుకూల వ్యవసాయ పద్దతులు, సాంకేతిక తపై రిలియన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంటల సాగులో రసాయనిక పద్ధతులను తగ్గించి పర్యావరణ అనుకూల పద్దతులు పాటించాలని, భూసార పరీక్షల ఫలితాల ప్రకారం ఎరువులు వేసుకోవాలని అన్నారు. అధికంగా ఎరువులు ఉపయోగించడం కారణంగా పెట్టుబడి ఖర్చులు పెరగడంతో పాటుగా వారవణం దెబ్బతింటుందన్నారు. అనంతరం రిలియన్స్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ రాజు మాట్లాడుతూ రైతులకు యాజమాన్య పద్ధతులు, సేంద్రియ ఎరువుల ఉపయోగం, వ్యవసాయశాఖ చేపడుతున్న కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇసన్నపల్లి సర్పంచ్ గుడిసె రాములు, రిలియన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి వీరేశం, ఇఫ్కో మేనేజర్ నరేష్, రిలియన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రసాద్, భూపతి, సతీష్, ఆయామండలాల రైతులు పాల్గొన్నారు.



బస్వాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆవు తోక పట్టుకొని చెరువులోకి వెళ్లిన బాలుడు

● నీట మునిగి మృత్యువాత



సోము శ్రీనివాస్ (ఫైల్)

బీర్కూర్, జనవరి 19: ఆవు తోక పట్టుకొని చెరువులోకి వెళ్లిన బాలుడు.. ఈత రాక నీట మునిగి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సోము శ్రీనివాస్ (16) అనే బాలుడు చదువు మానేశాడు. అతడి తండ్రి శంకర్ గేదెలు, ఆవులను కొనుగోలు చేసి శ్రీనివాస్‌కు అప్పగించాడు. రోజూలాగే శ్రీనివాస్ శుక్రవారం కూడా పశువులను మేపడానికి గ్రామ సమీపంలోని పెద్ద చెరువలోకి వెళ్లాడు. నీరు తాగించేందుకు ఆవులను చెరువులోకి తరిమాడు. ఈ సందర్భంగా తాను కూడా ఓ ఆవు తోక పట్టుకుని చెరువులోకి వెళ్లాడు. అయితే చెరువు మధ్యలోకి వెళ్లాకా ఆవు ఒక్కసారిగా విదిలించడంతో.. తోక జారిపోయి శ్రీనివాస్ నీట మునిగిపోయాడు. అతడితో పాటు వచ్చిన మహేష్ అనే బాలుడు పరుగెత్తుకుంటూ ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని చెప్పాడు. వెంటనే గ్రామస్తులు, కుటుంబీకులు కలిసి చెరువు వద్దకు వచ్చి చూడగా.. శ్రీనివాస్ శవమై కనిపించాడు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

● మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి కార్మిక సంఘ నాయకుల వినతి

భిక్కనూరు, జనవరి 19: మండలంలోని జంగంపల్లి గ్రామంలో నిరుపేదలు నివసిస్తున్న మల్లు స్వరాజ్యం కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ శుక్రవారం రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు, జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం కాలనీలో పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, వారికి ప్రభుత్వం తరుపున ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, వెంటనే కాలనీలో నీటి, కరెంట్ సౌకర్యం కల్పించాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కోరగా 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని, గుడిసెల్లో జీవిస్తున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఉచిత పరీక్ష శిబిరం విజయవంతం



క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైద్యులు

దోమకొండ, జనవరి 19: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం స్వస క్యాన్సర్ కేర్, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, జనగామ గ్రామానికి చెందిన తిమ్మయ్యగారి వాణివేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం విజయవంతం అయినట్లు వైద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు చతుర్వేది మాట్లాడుతూ స్వస క్యాన్సర్ కేర్ తరపున ఎడు క్యాంపులు తెలంగాణ వ్యాప్తంగా చేస్తున్నట్లు తెలిపారు.ఎవైన క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే జిల్లా ఆసుపత్రిలో, లేదా హైదరాబాద్‌లో చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ఆడవాళ్లకు ముఖ్యంగా రోమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్, గర్భశయ క్యాన్సర్‌లు ఉంటాయని అందుకు కొత్త పరికరాలను తీసుకువచ్చినట్లు తెలిపారు. క్యాన్సర్ ఉందని అనుమానం వస్తే దోమకొండలో కూడ పరీక్షలు చేసే వసతులు ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా చేయించే బాధ్యత తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సర్పంచ్ అంజలి,శ్రీనివాస్, పాత రాజు, నిమ్మ శంకర్, షమ్మీ, అనంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, స్వామి, మధు, వైద్యులు,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, జనవరి 19 : నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిక కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చేరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహా పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.



విత్తనాల దుకాణంలో మిషన్ పరిశీలిస్తున్న ఏవో

విత్తనాల కోసం ఆధార్ కార్డు తీసుకెళ్లాలి

దోమకొండ, జనవరి 19: మండలంలోని రైతులు విత్తనాల దుకాణాలలో వివిధ రకాల విత్తనాలకు కొనుగోలు చేయుటకు వెళ్లినపుడు తప్పకుండా ఆధార్ కార్డును తీసుకెళ్లాలని మండల వ్యవసాయాధికారి పవన్ కుమార్ అన్నారు. శుక్రవారం విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాల దుకాణాల్లో ఈపాస్ మిషన్ ద్వారానే విత్తనాల విక్రయాలు జరుగుతున్నందున ఆధార్ తప్పని సరిగా రైతులు వెంట తీసుకెళ్లాలన్నారు. అలాగే ఎవరైన నకిలీ విత్తనాలు రైతులకు అమ్మినట్లు తమ దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం వరినాట్లు వేస్తున్నందున పంట సాగుకై ఎటైన సలహాలు, సూచనలకు ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.అంబార్‌పేట క్లస్టర్‌లో శ్రీలత, దోమకొండ క్లస్టర్‌లో క్రిష్టారెడ్డిలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

మిర్జాపూర్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నసురుల్లాబాద్, జనవరి 19 : నసురుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నమో టీమ్ కామారెడ్డి జిల్లా కన్వీనర్ నాగేళ్ళ సాయి కిరణ్, సర్పంచ్ వెంకటరమణ, అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రియాంక, బ్యాంకు నోడల్ ఆఫీసర్ రాహుల్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో స్వచ్ఛ తీర్థ కార్యక్రమాలు

నిజాంసాగర్, జనవరి 19: మండలంలోని ఆయా ఆలయాలను బీజేపీ నాయకులు పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణ తార, బీజేపీ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డిలు మాట్లాడుతూ.. ఈ నెల 22న అయోధ్యలో శ్రీ రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఆలయాలను శుభ్రం చేస్తున్నామన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

శబరిమాతకు పల్లకీ సేవ

తాడ్వాయి, జనవరి 19: మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో గురువారం రాత్రి పల్లకిసేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి ఊరేగించారు. అంతకుముందు అమ్మవారి భక్తులు శ్రీ శబరిమాత పాలరాతి విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారం పాటు నిర్వహించే పల్లకి సేవకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా పూజలు నిర్వహించనున్నారు.



దోమకొండలో మాట్లాడుతున్న ఎస్సై మురళి

'అపరిచిత వ్యక్తులకు ఓటీపీ చెప్పొద్దు'

దోమకొండ, జనవరి 19: అపరిచిత వ్యక్తులకు ఓటీపీ చెప్పకుండా ఉండాలని ఎస్సై మురళి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు ఎవరైన బ్యాంక్ లోన్ ఇప్పిస్తామని చెప్పి పర్సనల్ వివరాలు, ఏటీఎం కార్డు నంబర్ అడిగితే చెప్పవద్దన్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సుబ్రహ్మణ్యచారీ, పీసీలు సంజీవరావు, వెంకటేష్, రాజమణి, పిరంగి రాజేశ్వర్ పాల్గొన్నారు.

సరస్వతీ ఆలయంలో భక్తుల పూజలు

బాన్సువాడటౌన్, జనవరి 19: పట్టణంలోని శ్రీ విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో శుక్రవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం నుంచి అర్చకులు సుప్రభాత సేవ, అభిషేకం, అర్చనలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి శ్రీ సరస్వతీ మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ సరస్వతీ దీక్షా స్వాములు సైతం అమ్మవారికి అభిషేకాలు చేపట్టారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఆరుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

భిక్కనూరు, జనవరి 19: మండలంలోని జంగంపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ బోల్తాపడి ఆరుగురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగంపల్లి గ్రామానికి చెందిన శివ, రాజు, మైసయ్య, వెంకటి, ఎల్లయ్య, భూపతి పొందూర్తిలో ఐడర్ రాళ్లను తీసుకురావడానికి ట్రాక్టర్‌లో వెళ్తుండగా గ్రామశివారులో ట్రాక్టర్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఒక్కసారిగా ట్రాక్టర్ బోల్తాపడి రోడ్డు కిందకు పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి స్వల్ప గాయాలు కాగా వీరిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

అన్నదాన కార్యక్రమానికి విరాళం

భిక్కనూరు, జనవరి 19: అయోధ్యలో ఈ నెల 22న రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని భిక్కనూరు మండల కేంద్రంలో రామదండు ఆధ్వర్యంలో చేపట్టనున్న అన్నదానం కార్యక్రమానికి కెజెఎల్ ఫౌల్ట్రీ యాజమాని సత్యనారాయణరాజు రూ.లక్ష విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రామదండు ప్రతినిధులు మాట్లాడుతూ ఈ నెల 22న భిక్కనూరులో పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

గృహ నిర్మాణాలకు ఇసుక కొరత

● అనుమతుల కోసం తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్, జనవరి 19: ఇసుక లభించక పోవడంతో బీర్కూర్ మండలంలో గృహ నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు శశికాంత్ అన్నారు అధికారులు వెంటనే స్పందించి ఇసుకకు అనుమతులు మంజూరు చేయాలని ఆయన కోరారు. శుక్రవారం శశికాంత్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ లతకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీర్కూర్ మండలంలో ఎంతో మంది లబ్ధిదారులు గృహాలను నిర్మించుకుంటున్నారని అన్నారు. అయితే గత రెండు నెలలుగా ఇసుక తవ్వకాలకు, రవాణాకు అనుమతులు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గృహ నిర్మాణ పనులు నిలిచిపోయాయని అన్నారు. లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇసుక తవ్వకాలకు, రవాణాకు అనుమతులు ఇవ్వాలని ఆయన కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కల్లు సాయిరాం, మంద మహేష్, పాకాల సతీష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- నా సామి రంగ
ప్రియా 35	- సైందవ్

బాన్సువాడ

మహేశ్వరి	- గుంటూరు కారం
వెంకటేశ్వర	- హనుమాన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

